



# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 25-01-2024 సంపుటి : 06 సంచిక : 136 పేజీలు : 8 వెల : రూ 3-00

# కాంగ్రెస్ మా సోదరిని ప్రయోగించింది..

## దేవుడే గుణపాఠం చెబుతాడు : సీఎం జగన్



విజయవాడ: కాంగ్రెస్ చెత్త రాజకీయం చేస్తోందని ఏపీ సీఎం జగన్ విమర్శించారు. కుటుంబాన్ని చీల్చి రాజకీయం చేస్తోందని ఫైర్ అయ్యారు. తిరుపతిలో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం జగన్..ఈ కామెంట్స్ చేశారు. గతంలో తన బాబాయ్‌ను మంత్రిని చేసి కాంగ్రెస్ తమపై ప్రయోగించిందని చెప్పారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోని కాంగ్రెస్ మరోసారి సోదరని తన పైకి ప్రయోగించిందని పేర్కొన్నారు. దేవుడు వారికి గుణపాఠం చెబుతారన్నారు జగన్. ప్రజా వ్యతిరేకత ఉన్నందునే కొందరికి టికెట్లు ఇవ్వలేదని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన కూటమితోనే తమకి పోటీ అన్నారు. ప్రజలు తమవైపే ఉన్నట్లు భావిస్తున్నామన్నారు జగన్. చంద్రబాబు విషయంలో ప్రతీకారం అన్నది లేనే లేదని.. సీఐడీ దుర్వినియోగ ఆరోపణలు అర్థరహితమన్నారు.ఇక ఏపీలో విద్యా సంస్కరణలపై సీఎం జగన్ కీలక కామెంట్స్ చేశారు. పేదరికం తొలగించేందుకు చదువుపై పెట్టుబడి పెట్టడం మినహా మరో మార్గం లేదన్నది తన బలమైన నమ్మకమన్నారు. నాణ్యమైన విద్య అందుకోవడం ప్రతీ ఒక్కరి హక్కు కావాలని చెప్పారు. గతంలో పేదలకు తెలుగు మీడియంలో బోధన జరిగేది, ధనిక పిల్లలు ఇంగ్లీషులో చదివేవారని.. ఆ పరిస్థితి తాము పూర్తిగా మార్చివేసి.. పేదలకు సైతం ఆంగ్ల విద్యను చేరువ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం బోధించేలా చేయరాదని విమర్శించే వాళ్ల పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారు? అని సీఎం ప్రశ్నించారు. పిల్లలకు ఈజీగా అర్థమయ్యేలా.. పాఠ్యపుస్తకాల్లో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లీష్ పెట్టినట్లు తెలిపారు. నాడు-నేడు తీసుకొచ్చి పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. 62వేల తరగతి గదులుంటే .. 40 వేల తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ టీవీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8వ తరగతి విద్యార్థులందరికీ ఒక ఆధునికమైన టాబ్ నేర్చుకునేందుకు అందించినట్లు సీఎం తెలిపారు. బోధనకు అదనంగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన బైజూస్ అంశాలను చేర్చినట్లు వివరించారు. ఐదేళ్ల తర్వాత ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో బ్యాక్యులరేట్ సర్టిఫికెట్ కోసం పోటీ పడతారన్నారు జగన్. ఎః, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. ఏటా ఒక్కో తరగతి పెంచుకుంటూ.. చిన్న నుంచి పెద్ద తరగతుల వారికి ఎః బోధన ఇస్తున్నామన్నారు.

# యువతతో ప్రధాని మోదీ వర్చువల్ మీట్.. ఎందుకంటే

ఢిల్లీ: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ యువతతో వర్చువల్‌గా మాట్లాడనున్నారు. గురువారం జరగనున్న ఈ కార్యక్రమానికి బీజేపీ యువజన విభాగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ



మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో యువతతో ప్రధాని మాట్లాడనున్నారు. బీజేవైఎం అధ్యక్షుడు తేజస్వీ సూర్య మాట్లాడుతూ.. 2014, 2019 ఎన్నికల్లో ప్రధానిని ఎన్నుకోవడంలో యువత కీలక పాత్ర పోషించారని.. ఇదే ఒరవడిని రానున్న ఎన్నికల్లో కొనసాగించేలా ప్రధాని స్ఫూర్తి నింపుతారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశ యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించిందని.. వారు మూడో సారి మోదీనే ప్రధానిగా చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం ఉత్సాహంగా ముందుకు వచ్చి ఓటు వేసేందుకు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఆర్థిక రంగాన్ని వృద్ధి పథంలో నడిపించి, మౌలిక సదుపాయాలు పెంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని ఆయన వెల్లడించారు. మోదీతో జరగనున్న వర్చువల్ మీట్‌లో దేశ వ్యాప్తంగా 5 వేల ప్రదేశాల్లో లక్షల మంది యువ ఓటర్లతో ప్రధాని మాట్లాడతారని వివరించారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి యువ ఓటర్లతో సంభాషించడం ఇదే తొలిసారి అవుతుందని.. ఇది ఎన్నికల్లో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందని వివరించారు. దేశ వ్యాప్తంగా 18 - 25 ఏళ్ల వయసు కలిగిన వారు దాదాపు 7 కోట్ల మంది ఉన్నారని అంచనా.

# సోషల్ మీడియాలో ట్రెండ్ నారా లోకేష్




విజయవాడ, జనవరి 24 టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈరోజు ఆయన జన్మదినం కావడంతో టిడిపి శ్రేణులు వినూత్న రీతిలో శుభాకాంక్షలు చెబుతున్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుతున్నారు. టిడిపి శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరోవైపు నారా లోకేష్ తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటుగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ కు బర్త్ డే విషెస్ చెబుతూ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో సందేశాలు పెడుతున్నారు. హ్యాపీ బర్త్డే యంగ్ లీడర్ లోకేష్ హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. దేశవ్యాప్తంగా రెండో స్థానంలో? హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో ఉంది. నాడు మంత్రిగా లోకేష్ తీసుకున్న కీలక నిర్ణయాలను గుర్తు చేస్తూ అభిమానులు ట్వీట్ చేస్తున్నారు. యువగళం సక్సెస్ ఫుల్ గా పూర్తి చేయడాన్ని అభినందిస్తున్నారు. టిడిపికి భావి నాయకుడిగా అభివర్ణిస్తున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల సైతం తమ ట్విట్టర్ ఖాతాలో శుభాకాంక్షలు చెప్పారు.గత ఏడాది జన్మదిన వేడుకల సమయంలో సైతం లోకేష్ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో జాతీయస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచారు. గత ఏడాది జనవరి 27న యువగళం పాదయాత్రను లోకేష్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. డిసెంబర్ 20న విశాఖ జిల్లాలో ముగించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలో పాదయాత్ర విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. లోకేష్ రాజకీయంగా పరిణితి సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులతో మమేకమై పనిచేస్తున్నారు. గతం కంటే తన బలాన్ని పెంచుకుంటూ పార్టీపై పట్టు సాధించారు. అందుకే పార్టీ శ్రేణులు లోకేష్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపాయి. సోషల్ మీడియాలో లోకేష్ ట్రెండింగ్ గా నిలవడం పై టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే స్ఫూర్తిని కొనసాగించి తెలుగుదేశం పార్టీకి ఘన విజయం సాధించి పెట్టాలని కోరుతున్నాయి.

# చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని సుప్రీంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్



అమరావతి : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బెయిల్ పిటిషన్ పై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ మంజూరును సవాల్ చేస్తూ చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని సుప్రీంను కోరింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన కేసులో ఏపీ హైకోర్టులో జనవరి 10న విచారణ జరుగగా కోర్టు చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసు ఈ నెల 29న ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది.రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైనింగ్‌తో పాటు ఐఆర్ఆర్ ఎలైన్‌మెంట్ రూపకల్పనలో అక్రమాలు జరిగాయని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేయగా చంద్రబాబు హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసి బెయిల్ పొందారు.

# వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి: సజ్జల




విజయవాడ: వైఎస్సార్ ఆశయాలు.. ఆలోచనలకు అనుగుణంగా పెట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ.. అణగారిన వర్గాలతో అసోసియేట్ అవ్వడమే ప్రధాన లక్ష్యమని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024-డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం జగన్.. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారన్నారు. "పథకాలు, సంస్కరణల్లో సీఎం జగన్ బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేశారు. అణగారిన వర్గాలనుపైకి తీసుకువచ్చే ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల భాగస్వామ్యం కావాలి. గత ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల కోసం ఖర్చు చేసిందేమీ లేదు. సంపన్నులతో పోటీ పడే స్థాయికి అన్ని వర్గాలనూ తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. సచివాలయ ఉద్యోగాల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే దక్కాయి. మేనిఫెస్టోలో లేనివి కూడా సీఎం జగన్ అమలు చేశారు" అని సజ్జల పేర్కొన్నారు."టీడీపీ హయాంలో పథకాలు కొందరికే దక్కేవి. సీఎం జగన్ అర్హులైన వారిని వెతికి మరీ ఇచ్చారు. ఈ నాలుగున్నరేళ్లలో జరిగినంత సంక్షేమం స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జరగలేదు. ఎన్నికలు రాబోతున్నాయ్. మీ భవిష్యత్తులు మారాలంటే.. మీరంతా ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏ చిన్న తేడా జరిగినా పేదలకు జరుగుతున్న మంచి దూరమైపోతుంది. మీడియాను మేనేజ్ చేస్తే సరిపోతుందని కొన్ని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఏమీ జరగడం లేదని ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచికి.. అభివృద్ధికి పబ్లిసిటీ అవసరం లేదని సీఎం భావించారు" అని సజ్జల తెలిపారు.కొత్తగా రూపుదిద్దుకుంటున్న పోర్టులు రాష్ట్రం రూపురేఖలు మార్చేస్తాయి. 11 మెడికల్ కళాశాలల ద్వారా దేశానికి కావాల్సిన వైద్యులను ఏపీ అందించబోతోంది. అంబేద్కర్‌కు హిమాలయాలంత విగ్రహం పెట్టినా సరిపోదు. అంతర్జాతీయ స్థాయిలో అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం రూపుదిద్దుకుంది. అంబేద్కర్ విగ్రహం గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుకుంటుంది.

# సీఎం రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బంది మార్పు..!



హైదరాబాద్ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతా విషయంలో కీలక మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సీఎం రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బంది మొత్తాన్ని మార్చాలని ఇంటెలిజెన్స్ నిర్ణయించినట్లు సమాచారం. గతంలో మాజీ సీఎం కెసిఆర్ దగ్గర పని చేసిన పోలీస్ సెక్యూరిటీని మార్చాలని నిర్ణయించింది.కేసీఆర్ దగ్గర పని చేసిన ఏ ఒక్క అధికారిని కూడా సీఎం రేవంత్ వద్ద పెట్టొద్దని సీఎంఓను ఐబీ ఆదేశించింది. సీఎం రేవంత్ వ్యక్తిగత సమాచారం లీక్ అవుతుందని భావిస్తున్నారని.. ఇప్పటికే కొత్త వారిని నియమించేందుకు ఇంటలిజెన్స్ కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం.

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించండి.

### జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన.



కర్నూలు జనవరి 22 :- జనవరి 26 న నిర్వహించేగణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో స్పందన కార్యక్రమం లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా శాఖల పరిధిలో చేయాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. వేడుకలు నిర్వహించే మైదానాన్ని సిద్ధం చేయాలని, పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, ప్రోటోకాల్ బాధ్యతలు, సీటింగ్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు గత ఏడాది మాదిరిగానే నిర్వహించాలని, ఈ ఏడాది మరిన్ని విభిన్నమైన తెలుగు పాటలను ఎంపిక చేయాలని నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, తెలియజేస్తూ స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

# సంపాదకీయం

గురువారం 25-01-2024

## ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై భారీ ఆశలు

దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో నిరుద్యోగం ప్రధానమైంది. దీని కారణంగానే యువతలో అసహనం అసంతృప్తి పెరిగిపోతోంది. ప్రైవేటు సెక్టార్లో మంచి ఆఫర్లు ఉన్నప్పటికీ దానికి సరిపడా స్కిల్స్ లేకపోవడంతో ఉద్యోగ వేటలో చాలా మంది యువత వెనకబడుతున్నారు. ఈ మధ్య కాలంలో ఉద్యోగాలు చేయడం కంటే ఏదో బిజినెస్, వ్యాపారం పెట్టుకొని పది మందికి ఉద్యోగం కల్పించాలనే ఆలోచన ఎక్కువమందిలో కనిపిస్తోంది. ఈ కారణాలు బడ్జెట్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టేలా చేస్తున్నాయి. ఎన్నికల ఏడాదిలో పెట్టే బడ్జెట్ ఎప్పుడూ పెద్ద ఇంపాక్ట్ చూపదు. కానీ మారిన పరిస్థితులు, రాజకీయ సమీకరణాల కారణంగా బడ్జెట్‌పై అంచనాలు పెరిగిపోతు న్నాయి. ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, ఆంత్రపెన్యూర్‌షిప్ ఇలాంటి వాటిపై జెడ్ జనరేషన్ భారీగా ఆశలు పెట్టుకుంది. ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉన్న సెక్టార్లపై ఈసారి తాత్కాలిక బడ్జెట్ దృష్టి పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. నిరుద్యోగత పెరిగిపోతున్న టైంలో వారికి సరైన దారి చూపేందుకు వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. అలాంటి సెక్టార్లకు ప్రొడెక్షన్ లింక్డ్ ఇన్సెటివ్ స్కీమ్ ద్వారా చేయూత ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.ఎక్కువ మొత్తంలో ఉద్యోగాలు కల్పించే గార్మెంట్స్, జ్యూవెలరీ, హ్యాండిక్రాఫ్ట్ లాంటి విభాగాలకు పీఎల్ఐ స్కీమ్‌లు మరింతగా ఇంప్లిమెంట్ చేయనున్నారు. ప్రస్తుతం స్కీమ్‌లో 14 విభాగాలు ఉన్నాయి. అందులో చాలా వరకు అనుకున్న స్థాయిలో ఉద్యోగాల కల్పన చేయలేకపోతున్నాయి. అందుకే వాటిలో మార్పులు చేర్పులు ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల ఆదాయం పెంచేందుకు పీఎల్ఐ స్కీమ్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ స్కీమ్‌లో ఉన్న కంపెనీల్లో చాలా వరకు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యాయి. అందుకే వీటిని రివైజ్ చేసి మరికొన్ని సెక్టార్లను ఇందులో చేర్చనున్నారు. లెథర్, గార్మెంట్, జ్యూవెలరీ, హ్యాండీక్రాఫ్ట్ లాంటి భారీగా ఉద్యోగాలు అందించే విభాగాలను చేరిస్తే పథకం అసలు లక్ష్యం నెరవేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా తర్వాత వర్క్ కల్చర్ పూర్తిగా మారిపోయింది. చాలా కంపెనీలు రిమోట్ పనికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీన్ని దృష్టి పెట్టుకొని కూడా కొన్ని వెసులుబాటులు కల్పించాల్సి ఉంటుందని నిపుణులు, యువత ఆలోచనగా ఉంది. అదే టైంలో ఫ్రీలాన్స్ ఉద్యోగాలపైవు కూడా యువత దృష్టి పెట్టింది. దీని వల్ల కూడా ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇలాంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వగలిగితే మంచిదని అంటున్నారు. భారీగా పెరిగిపోతున్న ఇంటి కనుగోలు అంశంపై కూడా దృష్టి పెట్టాలని యువత కోరుకుంటోంది. ప్రస్తుతం ఉన్న ఫైనాన్స్ ఫొజిషన్‌లోనే ప్రభుత్వ సాయంతో ఇంటిని కొనుక్కోవాలని ఆశిస్తోంది. రియల్‌ఎస్టేస్ నుంచి కూడా కొన్ని అభ్యంతరాలు ఉన్నాయి. ఓ ప్రాజెక్టు ప్రారంభించాలంటే... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 30కిపైగా అనుమతు కావాల్సి ఉంది. దీని కారణంగా ప్రాజెక్టు ఆలస్యమై రేట్లు పెరిగిపోతున్నాయని వారి వాదన. దీనికి ఒక సింగిల్ విండో సిస్టమ్ ఉంటే కచ్చితంగా ఇన్‌టైంలో అనుమతులు వస్తాయని చెబుతున్నారు. అందరికీ ఇళ్లు అనే కాన్సెప్టులో దీన్ని ఆలోచించి త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని యువతరం అభ్యర్థిస్తోంది. ముఖ్యంగా జనరేషన్ జెడ్‌లో ఈ బడ్జెట్‌పై భారీ అంచనాలో ఉన్నాయని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఉద్యోగ కల్పన, విద్యాసంస్కరణలు, పన్ను రాయితీపై అంశాలపై వీళ్ల ఫోకస్ ఎక్కువగా ఉందని చెబుతున్నారు. 2000 తర్వాత పుట్టిన వారిని జెడ్ జనరేషన్ అంటారు. ఈ జెడ్ జనరేషన్ టెక్నికల్ సావీగా ఉంటారు. జీవితంపై క్లారిటీతో సమాజం పట్ల పూర్తి అవగాహనతో ఉంటారు. ప్రపంచ జనాభాలో వీళ్లదే పైచేయి. సుమారు 45 నుంచి 50 శాతం వరకు జనరేషన్ జెడ్ ఉంటారని లెక్కలు చెబుతున్నాయి. అందుకే ప్రభుత్వాలు తీసుకుంటున్న పాలసీలు వీళ్లను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం లేఆఫ్‌ల దశ నడుస్తోంది. గతేడాది కార్పొరేట్ ఉద్యోగాల్లో భారీగాకోతలు పడ్డాయి. ఈ ఏడాది కూడా అంతకు మించి ఉంటాయన్న టాక్ నడుస్తోంది. ఇలాంటి టైంలో వాటికి అడ్డుకట్ట పడేలా ప్రభుత్వం చర్యలు ఉండాలని ఆశిస్తోందీ జనరేషన్. అందుకే బడ్జెట్‌లో అద్భుతాలు ఉండాలని కోరుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో విద్య చాలా భారంగా మారిపోతోంది. ఓ దశ దాటి తర్వాత చదవాలని యువతరానికి ఉన్నప్పటికీ చదివించే స్థాయిలో పేరెంట్స్ ఉండటం లేదు. ఆర్థిక కమిట్‌మెంట్స్‌లో పై చదువులు చదవలేక ఏదో జాబ్‌లో సెటిల్ అయిపోతున్నారు. అందుకే అలాంటి వారికి వెసులుబాటు కలిగేలా విద్యారుణాలపై కరుణించాలని ఆశిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో విద్యకు ఇచ్చే కేటాయింపులు పెంచాలని కోరుతున్నారు. విద్యాసంబంధిత వస్తుసేవలపై జీఎస్టీ స్లాబ్స్ విషయంలో కూడా కాస్త కనికరించాలని కోరుతున్నారు

# ఆసరా కాదు ..ఇది టోకరా....

## మహిళల మాంగల్యాలు తెంచిన జగన్ రెడ్డి. ఇచ్చేది గోరంత...దోచేది కొండంత



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 24 డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు సమానంగా రూ. 20 వేలు లబ్ధిపొందారని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఒక్కొక్క మహిళ పొందిన లబ్ధి రూ. 15 వేలకు తగ్గిపోయిందని, ఈ రకంగా 50 లక్షలమంది డ్వాక్రా మహిళలకు జగన్ రెడ్డి టోకరా వేశాడని అన్నారు . నేడు రాష్ట్రంలో కోటీ 14 లక్షలమంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షలకే కుదించారని, ఈ రకంగా 35 లక్షలమందికి మొండిచేయి చూపారని అన్నారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి రూ. 2 లక్షల విలువ గల నాశిరకం మద్యం అమ్మారు. భార్యాబిడ్డలు తినాల్సిన మందు బాబుల కష్టార్జితాన్ని మద్యం ద్వారా జగన్ రెడ్డి దోచుకుతింటున్నాడు. నాశిరకం మద్యంతో 35 లక్షలమంది ఆరోగ్యాలు నాశనం చేశాడు. అందులో 30 వేల మంది అకాలమృత్యువాత పడ్డారు. నాశిరకం మద్యం ద్వారా మహిళల మాంగల్యాలు మంటగలుపుతున్నాడని మండిపడ్డారు.పిన్నమ్మ తాళి తెంచిన నరహంతకుల్ని రక్షిస్తున్న జగన్ రెడ్డి మహిళా ద్రోహి కాదా? చెల్లికి ఆస్తిలో భాగం ఇవ్వని జగన్ రెడ్డి మహిళాద్రోహే అని అన్నారు. కొని తినే ప్రతి వస్తువుపై ధరలు పెంచి ఒక్కో కుటుంబంపై 57 నెలల పాలనలో రూ. 3 లక్షల భారం మోపారు. జగన్ ఇచ్చేది గోరంత-దోచేది కొండంత.చంద్రన్న పాలనలో సున్నా వడ్డీ రూ.5 లక్షలకు వర్తింపజేస్తే,దాన్ని జగన్ రెడ్డి రూ. 3 లక్షలకు కోత కోసి మోసం చేశాడు. ఆ రూ. 3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోంది,కానీ జగన్ ఇచ్చింది సున్నా. ఉచితంగా ఇళ్లు ఇస్తానని నమ్మించి మాట తప్పి ఓటీఎస్ పేరుతో ఒక్కో మహిళ నుంచి రూ. 10 వేల నుంచి రూ. 30 వేలు బలవంతంగా వసూలు చేశాడు. సెంటు పట్టాలో ఇళ్ల నిర్మాణం పేరుతో మహిళలను అప్పులపాలు చేశారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదు. 8. చంద్రన్న అధికారం లోకి వచ్చి ఉంటే మొదటి ఏడాది నుంచే 3 వేల ఇళ్లు ఇచ్చి ఉండేవారు. వాయిదాల వల్ల ఒక్కో అవ్వాతాత రూ. 30 వేలు నష్టపోయారు. పెళ్లి కానుకల రద్దు వల్ల కఠిన నిబంధనల వల్ల పేదింటి ఆడపిల్లలకు తీరని నష్టం చేశారు. అంగన్వాడీల జీతాలు చంద్రన్న రూ. 6,300 పెంచగా జగన్ పెంచింది కేవలం రూ. 1000 మాత్రమే. మరోవైపు 2014 ఏప్రిల్ 1 నాటికి డ్వాక్రా సంఘాల ఎన్.పి.ఏలు 10.33 శాతం (ఎస్ఎల్ బిసి -182) ఉండగా 2019 ఏప్రిల్ 1 నాటికి 1.56 శాతానికి తగ్గించిన ఘనత చంద్రబాబుది( ఎస్ ఎల్ బి సి 206). కానీ జగన్ రెడ్డి 18 శాతం అంటూ నిస్సిగ్గుగా రోత రాతలు రాయిస్తోంది వాస్తవం కాదా, ఎన్ సి ఆర్ బి ప్రకారం ఒక్క 2022లోనే మహిళలపై 25,503 నేరాలు జరిగాయని అన్నారు. 601 అత్యాచారాలు,180 అత్యాచార యత్నం ఘటనలు వెలుగుచూశాయి. జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4% కాగా, ఏపీలో మాత్రం 96.2% నమోదు కావడం మహిళా భద్రతలో జగన్ రెడ్డి డొల్లతనాన్ని తెలియజేస్తోంది. వైసీపీ పాలనలో 30,196 మంది మహిళలు,చిన్నారులు మిస్సయ్యారు. 2019తో పోలిస్తే 2021 మహిళల అదృశ్యం ఘటనలు 43.45 %, చిన్నారుల అదృశ్యం ఘటనలు 53.61% పెరిగాయి. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన 57 నెలల్లో మహిళలపై 2 లక్షలకు పైగా నేరాలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతున్నాయి. దిశా చట్టం ప్రచారార్భాటానికే పరిమితమైంది. మహిళలపై నేరాల పెరుగుదలకు జగన్ నాశిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ కూడా కారణాలుగా ఉన్నాయి. జాతీయ కుటుంబ,ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో 15 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న 12.6% బాలికలు గర్భం దాల్చుతున్నారు. ఈ దారుణాల్లో దేశంలోనే ఏపీ మూడో స్థానంలో ఉంది.ఇండియా టుడే సర్వే ప్రకారం ఏపీలో 1,33,447మంది వ్యభిచారకూపంలో చిక్కుకున్నారు. ఈ అమానుషాల్లో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మహిళా సంక్షేమకోతల వల్లే ఈ స్థితి వచ్చింది. అయినా మహిళలను బాగు చేశాను, మహిళలను ఉద్ధరించాను అని జగన్మోహన్ రెడ్డి చెప్పుకోవడం మోసకారితనమే అని అన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన శాసనసభ్యులు..



విభారె న్యూస్ జనవరి 24 శ్రీశైలం..బుధవారం (24.01.2024) స్థానిక శాసనసభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి క్షేత్రంలో పూర్తి చేయబడిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ పనుల మొత్తం వ్యయం రూ.3.98 కోట్లు. క్షేత్ర అభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టబడ్డాయి.రైల్వే అతిథిగృహం వద్ద నిర్మించబడిన ఆర్.సి.సి. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు,కొత్తపేటలో ఫేస్ -1 మరియు ఫేస్ -2 లలో మొత్తం 12 చోట్ల వేయబడిన సి.సి.రోడ్లు, ముదిరాజ్ సత్రము నుంచి మల్లికార్జున అన్నదానం జంక్షన్ వరకు వేయబడిన సి.సి. రోడ్డు,నందికేశ సదన్ వద్ద నిర్మించబడిన ఆర్.సి.సి. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, గంగా గౌరి సదన్ భవనాలకు నిర్మించబడిన జనరేటర్ రూము 380 కె.వి. డీజిల్ జనరేటర్లను శాసనసభ్యులు ఈ రోజు ప్రారంభించడం 2.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమములలో సహాయ కమిషనర్ హెచ్.జి. వెంకటేష్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు వి.రామ కృష్ణ, జి. మురళీధర్రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు (ఐ /సి) పి.వి. సుబ్బారెడ్డి, సంబంధిత అసిస్టెం ట్ ఇంజనీర్లు,పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## పలు కుల సంఘాల నాయకులను కలుస్తున్న అభిరుచి మదు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24-నంద్యాల పట్టణంలో బుధవారం పలు కుల సంఘాల నాయకులను కలసి బిజెపి పార్టీ ని బలపరచాలని అభిరుచి మదు కోరుతున్నారు. చాపకింద నీరులా తన స్టైల్ తనదే అన్న రీతిలో గుట్టు చప్పుడు కాకుండా అభిరుచి మదు పావులు కదుపుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు .నంద్యాలలో బిజెపి కి జోష్ నింపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాల రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.ఈ నేపథ్యంలోనే బలాన్ని పెంచుకోవడానికి మొదటి టార్గెట్ గా ఆర్యవైశ్య సామాజిక వర్గాలను కలవడం జరిగింది .భవిష్యత్తులో ఆయన ఊహలు ఎవరికి అందనంతగా వుండ నున్నట్లు తెలుస్తోంది.

## ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24- బుధవారం నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నెరవాటి అరుణకుమారి, డాక్టర్ సుసుమ, డాక్టర్ శైలజల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ చైర్ పర్సన్ సింగారెడ్డి నాగిని రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ జి రవికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బాలికలు, యువతుల కోసం నంద్యాల మిషన్ పింక్ హెల్త్ వాట్సాప్ హెల్ప్ లైన్ ను సింగారెడ్డి నాగిని రెడ్డి ఆవిష్కరించారు. సింగారెడ్డి నాగిని రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఈరోజు ముందంజ వేస్తున్నారని ,విజయాలు సాధిస్తున్నారని,తల్లిదండ్రులు బాలికలను వారు ఎంచుకున్న రంగంలో రాణించేలాగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ కార్యదర్శి డాక్టర్ వనిల్ కుమార్, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మధుసూదన్ రెడ్డి ,డాక్టర్ నాగమణి ,డాక్టర్ నర్మద ,డాక్టర్ కల్పన, డాక్టర్ సరిత, డాక్టర్ సునీత, డాక్టర్ మాధవి,డాక్టర్ లలిత, డాక్టర్ తనూజ, పలువురు మహిళా వైద్యులు, ఆసుపత్రుల మహిళా ఉద్యోగులు, పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

## కైరుప్పల గ్రామంలో నాటు సారా స్థావరాల పై విస్తృతంగా దాడులు?. - జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్.



విభారె న్యూస్ జనవరి 24 కర్నూలు (జిల్లా ప్రతినిధి).కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లో భారీగా పట్టుబడిన నాటుసారా.రానున్న ఎన్నికల నేపథ్యంలో విస్తృతందా దాడులు.జిల్లాలో ఎక్కడైనా నాటు సారా,మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజలు డయల్ 100 గాని, స్థానిక పోలీసులకు సమాచారం అందించండి. బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు పత్తికొండ సబ్ డివిజన్ డిఎస్పీ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి యుపియస్ పోలీసులు కైరుప్పల గ్రామంలో నాటు స్దావరాల పై పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దాడుల్లో 100 లీటర్ల నాటు సారా ఊట బెల్లం ను ధ్వంసం చేశారు.30 మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడులలో దేవనకొండ సిఐ శ్రీనివాసులు,ఆస్పరి సిఐ హనుమంతప్ప, ఆలూరు ఎస్సై ఓబులేషు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మందిరానికి కేజీల కొద్దీ బంగారం విరాళం

అయోధ్య,దాదాపు 500 ఏళ్ల తరువాత అయోధ్యలో రామయ్య కొలువుతీరాడు. భారతదేశంతో పాటు విదేశాలలోని భక్తులు సైతం చారిత్రాత్మక ఘట్టాన్ని లైవ్ స్ట్రీమింగ్లో వీక్షించారు. దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట అభిజిత్ లగ్నం ముహూర్తంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగింది. జన్మభూమిలో రాముడు కొలువు దీరాలని భావించి రోజువారీ కూలీల నంచి కుబేరుల వరకు దేశ విదేశాల్లోని భక్తులు అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి తమ వంతుగా విరాళం ప్రకటించారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి భూరి విరాళం సూరత్కు చెందిన వజ్రాల వ్యాపారి అందించారు. వి దిలీప్ కుమార్ అనే డైమండ్ బిజినెస్ మ్యాన్ కుటుంబం రామయ్యకు తన వంతుగా 101 కేజీల బంగారాన్ని విరాళం ఇచ్చారు. ఆలయంలో నిర్మించిన తలుపులకు బంగారం పూత పూయడం తెలిసిందే. అయితే మార్కెట్లో ఉన్న ధర ఆధారంగా చూస్తే.. వజ్రాల వ్యాపారి దిలీప్ కుమార్ ఫ్యామిలీ రామాలయానికి దాదాపు రూ.68 కోట్లు రామ మందిరం ట్రస్టుకు విరాళం అందించినట్లు తెలుస్తోంది. రామయ్య గుడి నిర్మాణానికి వచ్చిన భారీ విరాళం ఇదే. అయోధ్య రామ మందిర నిర్మాణానికి రెండో అతిపెద్ద విరాళాన్ని ఆధ్యాత్మిక గురువు మొరారీ బాపు అందించారు. రామ మందిరం కోసం మొరారీ బాపు రూ. 11.3 కోట్లను అందించారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్

అనకాపల్లి,పరవాడ మండలం పరిధి లో 79 మరియు 85వ వార్డు సంబంధించి లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాలకు సంబంధించి పలు కార్యక్రమాలకు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి ఆదిప్ రాజ్ శంకుస్థాపన చేసారు. కమ్యూనిటీ హాలు, డ్రైనేజీలు, సిసి రోడ్లు మరియు నాలుగు సచివాల యాలు జిజిఎంసిఫండ్స్, జీవీఎంసీ, జన రల్ ఫండ్స్, మొత్తం మీద సుమా రు ఒక కోటి48లక్షలుతోపలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకపక్క సంక్షేమం మరో పక్క అభివృద్ధి రెండు రెండు కళ్ళగాఈప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇన్నిరకాలైన సంక్షేమ పథకాలు ప్రజలందరికి అందిస్తూ ఎక్కడ పార్టీ చూడకుండాకులం,మతం చూడకుండా రాజకీయం చూడకుండా మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అదేవిధంగా అభివృద్ధి పనులుకు పెద్దపేట వేస్తుంది ఈ ప్రభుత్వమని అన్నారు.కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేన టివంటి లంకెల పాలెం హైస్కూల్ని నాడు నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడం జరిగింది.ఆర్కే లేఔట్ గాని ఇక్కడున్నా రింగ్ రోడ్డు గాని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగింది. వీటన్నిటిమీద వచ్చే నెల ఒకటో తారీకు నుంచి ప్రతి సచివాలయం పరిధిలో గత ప్రభుత్వం లో ఎంత అభివృద్ధి జరిగిందన్నది సచివాలయంలో విడుదల చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైయస్సార్ సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, 79 వ వార్డు రౌతు శ్రీనివాస్, 85 వ వార్డు ఇల్లపు ప్రసాద్ వైఎస్ఆర్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంక్రాంతి బోనస్ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి

**పండుగ బోనస్ చెల్లింపుకు తగిన చర్యలు చేపడతామని కమిషనర్ హామీ**

బద్వేలు,బద్వేలు మున్సిపల్ వర్కర్స్ఏ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె సందర్భంగా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ అంగీకరించిన ఒప్పందాల మేరకు సంక్రాంతి బోనస్ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులుకె.నాగేంద్రబాబుమాట్లాడు తూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పనిచేస్తున్న మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2023 వ సంవత్సరం డిసెంబర్ 26వ తేదీ నుండి 2024వ సంవత్సరం జనవరి 10వ తేదీ వరకు 16 రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె సందర్భంగా మున్సిపల్ రాష్ట్ర నాయకత్వంతో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ పలుదాపాలు చర్చలు నిర్వహించిన సందర్భంగా సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కాంట్రాక్ట్- ఔట్సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగ కార్మికులందరికీ ఒక్కొక్క కార్మికునికి1,000/-రూపాయలు చొప్పున పండుగ బోనస్ చెల్లిస్తామని అంగీకరించియుండి ఆ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు జీ.వో.ఎం.ఎస్ నెంబర్ 12, తేదీ 23-01-2024నజారీ చేయడం జరిగిందని కార్మికులందరికీ 1,000/- రూపాయలు మంజూరు చేయుటకు తగిన చర్యలు ప్రారంభిస్తామని కమిషనర్ గారు తెలిపారు.

# కొత్తగా వివాహం చేసుకునే వారికి ప్రభుత్వం షాక్

విజయవాడ, జనవరి 24 ఏపీలో కొత్తగా వివాహం చేసుకునే వారికి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వివాహాల నమోదుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచింది. వివాహ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఉండగా.. దానిని ఇప్పుడు రూ.500కు పెంచారు. దంపతుల అభ్యర్థనతో కార్యాలయం బయట జరిగే వివాహ వేదిక దగ్గరకు సబ్ రిజిస్ట్రార్ వస్తే.. ఇప్పటివరకు ఉన్న రూ.210 ఫీజును రూ. 5 వేలకు పెంచారు. వివాహాల రికార్డు పరిశీలనకు రూపాయి గా ఉన్న ఫీజును రూ.100కు పెంచారు. సెలవు రోజుల్లో వివాహాల నమోదుకు రూ.5 వేలకు పెంచారు.1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి సంబంధించి 1965 మార్చిలో జారీచేసిన ఫీజులను.. ఇటీవల సవరించిన వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఫీజుల విషయంలో కఠినంగా వ్యవహరించిన సర్కార్.. వివాహ రిజిస్ట్రేషన్ ను మరింత సులభతరం చేయనుంది. ఆన్ లైన్ నమోదు ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆన్ లైన్ వివాహ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో పూర్తిస్థాయిలో ఈ విధానం అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో మాన్యువల్ విధానంలో వివాహాల నమోదు ప్రక్రియ జరిగేది. ఇప్పుడు ఆన్ లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించనుండడంతో వివాహ రిజిస్ట్రేషన్ నమోదు సేవలు సులభతరం కానున్నాయి. లో హిందూ వివాహాలు, ప్రత్యేక వివాహాలు అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. అందులో హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ నెంబర్ లేదా ఈమెయిల్ ద్వారా ఓటిపితో లాగిన్ కావచ్చు. అనంతరం ఆన్ లైన్ లోనే ఫామ్ ను పూర్తి చేసి, ఆధార్ కార్డులు, పెళ్లి ఫోటోలు, పదో తరగతి సర్టిఫికెట్లు అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రిజిస్ట్రార్ ఆఫీస్ కి వెళ్లేందుకు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సిఎఫ్ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్ లైన్ లో చలానా ద్వారా కట్టే అవకాశం కూడా కల్పించారు. ఆ తర్వాత ఆన్ లైన్ లో నమోదు చేసిన దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్ కు అందిస్తే ఆయన దాన్ని పరిశీలిస్తారు. సాక్షులతో సంతకాలు పెట్టించుకుని వెంటనే సర్టిఫికెట్ ను జారీ చేస్తారు. ఇటీవల రేషన్ కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి కావడంతో ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణాల దృష్ట్యా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంపుతో పాటు సేవలను సైతం ప్రభుత్వం సరళీకృతం చేసింది. అయితే ఫీజులను భారీ స్థాయిలో పెంచడం విమర్శలకు తావిస్తోంది.

# సమ్మె విరమణలో ప్రభుత్వం సక్సెస్

విజయవాడ, జనవరి 24 ఏపీలో అంగన్వాడీలు సమ్మె విరమించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో గత 42 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. ఒకానొక దశలో ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. నిన్న సాయంత్రం లోపు విధుల్లో చేరాలని డెడ్ లైన్ విధించింది. లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో ఈ తొలగింపునకు సంబంధించి కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలపై ఒత్తిడి పెరిగింది. ఒక్క రూపాయి వేతనం పెంచకుండానే అంగన్వాడీలతో ప్రభుత్వం సమ్మె విరమింపజేసింది. సోమవారం రాత్రి మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అంగన్వాడి సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇవి సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు అంగన్వాడీ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు.అయితే జూలైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వడం విశేషం. మరో రెండు నెలల్లో వైసీపీ ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతుంది. ఎన్నికలు జరిగిన తర్వాత కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుంది. కొత్త ప్రభుత్వం తరఫున వైసీపీ సర్కార్ హామీ ఇవ్వడం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో.. అంగన్వాడీ వర్కర్ కు రూ.1.20 లక్షలు, హెల్పర్ కు రూ.60 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మట్టి ఖర్చుల కోసం రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. 42 రోజుల సమ్మె కాలానికి వేతనం ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేసులు ఎత్తివేస్తామని కూడా హామీ ఇచ్చింది.అయితే ప్రధాన డిమాండ్ గా ఉన్న జీతాల పెంపు విషయంలో మాత్రం ప్రభుత్వం మొండి చేయి చూపింది. జూలై నుంచి వేతనాలు పెంచుతామని చెప్పుకొచ్చింది. అయితే ఒత్తిళ్ల మూలంగానే అంగన్వాడీలు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వారికి అనేక రకాల ఒత్తిళ్లు, బెదిరింపులకు గురిచేసి సమ్మెను విరమింప చేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగిన 70000 మంది అంగన్వాడి మహిళలపై వేటు వేశారు. కలెక్టర్లకు సోమవారం ఎక్కడికక్కడే ఉత్తర్వులు ఇప్పించారు. కొంతమందికి తొలగింపు పత్రాలను కూడా అందించారు. ఈనెల 25 నుంచి కొత్త నియామకాలు చేపట్టేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 26న దరఖాస్తులు స్వీకరించి.. 31 లోపు ప్రక్రియ ముగిసేలా కసరత్తు కూడా ప్రారంభించారు. ఈ పరిణామాలతో అంగన్వాడీలు ఆందోళనకు గురయ్యారు. సమ్మె విరమణ శ్రేయస్కరమని భావించారు.అంగన్వాడీలకు బలవంతపు సమ్మె విరమణలో ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. గత 42 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న సీఎం జగన్ పెద్దగా పట్టించుకోలేదు. ఆ సంఘాల ప్రతినిధులను పిలిచి మాట్లాడలేదు. గత ఎన్నికలకు ముందు జగన్ అంగన్వాడీలకు చాలా రకాల హామీలు ఇచ్చారు. తాను అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.1000 అదనంగా జీతం చెల్లిస్తానని చెప్పుకొచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు ఇతరత్రా రాయితీలు కల్పిస్తానని కూడా హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సంగతి మరిచిపోయారు. గత 42 రోజులుగా సమ్మెబాట పట్టినా పట్టకుండా వ్యవహరించారు. రాజకీయ కార్యకలాపాల్లో మునిగితేలారే కానీ.. అంగన్వాడీలతో చర్చలకు ఇష్టపడలేదు. దీంతో సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని రకాల బెదిరింపులకు దిగి.. అంగన్వాడీలతో సమ్మె విరమింపచేశారు.

# వంద స్థానాల్లో అభ్యర్థులను పెట్టే లక్ష్యంతో షర్మిల



విజయవాడ, జనవరి 24 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నికలకు ముందు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. షర్మిల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వెంటనే జిల్లాల పర్యటన ప్రారంభించారు. ఇచ్చాపురం నుంచి ఆమె యాత్ర ప్రారంభించారు. ఇడుపులపాయ వరకూ సాగుతుంది. ఎన్నికలకు పెద్దగా సమయం లేనందున వెంటనే రంగంలోకి దిగారు. ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు కనీసం వంద స్థానాల్లో అయినా బలమైన అభ్యర్థులను పెట్టే లక్ష్యంతో షర్మిల పార్టీకి ఉత్సాహం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు కీలక నేతలు కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం ఊపందుకుంటోంది.షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరగానే ఆమె కండువా కప్పించుకున్నారు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి. వచ్చే ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున మంగళగిరి నుంచి పోటీ చేయడం ఖాయమే అనుకోవచ్చు. కాంగ్రెస్ లోకి రావాలని వైసీపీలో పెద్దగా ప్రాధాన్యత లభించని కీలక నేతలతో ఆళ్ల రామకృష్ణారెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో సీట్ల ఖరారును బట్టి కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయి. అందుకే ఆయా పార్టీల్లో చేరినా పోటీ చేసే అవకాశం లభించదు. బీజేపీకి పెద్దగా బలం లేదనందున ఆ పార్టీలో చేరలేదు. ఇక ఆప్షన్ ఉంది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. నిజానికి షర్మిల ఆ పార్టీలో చేరే వరకూ ఎవరూ పట్టించుకోలేదు. నీ షర్మిల చేరిన తర్వాత కొంత మంది ఆ పార్టీని ఓ ఆప్షన్ గా పెట్టుకున్నారు. దీంతో ఎక్కువగా చేరికలు ఉంటాయన్న ప్రచారం ఊపందుకుంటోంది.వైఎస్ షర్మిల యాత్ర చేస్తున్నారు. ఈ యాత్ర ఇడుపుల పాయ చేరుతుంది. ఈ యాత్రలో రాయలసీమకు చెందిన పలువురు కీలక నేతలు కాంగ్రెస్ లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంత్రి గుమ్మనూరు జయరాంకు ఈ సారి అసెంబ్లీ టిక్కెట్ నిరాకరించారు. ఎంపీ టిక్కెట్ కేటాయించారు. కానీ ఎంపీ వద్దు ఎమ్మెల్యే టికెటే కావాలని గుమ్మనూరు జయరాం పట్టుబడుతున్నారు. కావాలంటే తన వారసుడు గుమ్మనూరు ఈశ్వర్ కు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తాను ఎంపీగా పోటీ చేస్తానని జయరాం చెబుతున్నారు. వేరే వారు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే ఆలూరు నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా ఉన్న కేడర్ దెబ్బతింటుందని, అందుకే ఎమ్మెల్యేగా పోటీ చేయడానికే సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జయరాం చెబుతున్నారు. ఆయన కర్ణాటక కాంగ్రెస్ లో ముఖ్యమైన నేతలకు సన్నిహితుడు. దీంతో కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. షర్మిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ లో చేరుతారన్న ప్రచారం జరుగుతోంది. ఇక వైసీపీలో కీలక నేతగా ఉన్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పెద్దగా కనిపించడం లేదు. ఆయనకు కూడా టిక్కెట్ నిరాకరిస్తారన్న ప్రచారం జరుగుతూండటంతో కాంగ్రెస్ లోకి వెళ్లేందుకు చర్చలు జరుపుతున్నారని అంటున్నారు. ఈ క్రమంలో పది మంది ఎమ్మెల్యేల వరకూ కాంగ్రెస్ తో చర్చలు జరుపుతున్నారని.. రాబోయే రోజుల్లో రాయలసీమలో చేరికలు ఎక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ ద్వారా పోటీకి ఓ ఆప్షన్ ఉండటంతో అటు వైసీపీతో పాటు ఇటు టీడీపీలో కూడా సీటు రాని నేతలు కాంగ్రెస్ పార్టీ వైపు చూసే అవకాశం ఉంది. షర్మిల పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత పరిస్థితి మెరుగు పడిందన్న అభిప్రాయంతో కొంత మంది ఉన్నారు. పాత కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా ప్రస్తుతం వైసీపీ వైపు ఉంది. కానీ వైసీపీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోందన్న అభిప్రాయం పెరుగుతున్న సమయంలో అలాంటి వారి ఓట్లన్నీ మళ్లీ కాంగ్రెస్ కు వస్తాయన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ పుంజుకుంటే కీలక నేతలుగా మారే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.ఎన్నికలు దగ్గర ఉన్నందున అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ ముఖ్యులు సమాంతరంగా కసరత్తు చేస్తున్నారు. ఇతర ప్రధాన పార్టీలు అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేశాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది. పార్టీలో ఉన్న సీనియర్లు అందరికీ వారు కోరుకున్న స్థానాల్లో సీట్లు కేటాయిస్తారు. కాస్త సొంత బలం ఉన్న నేతలు పార్టీలో చేరితే ఓటు బ్యాంక్ పెరిగే అవకాశం ఉంది. రెండు, మూడు చోట్ల గెలిచినా కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోసినట్లవుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీలో ఎన్నికలకు ముందు ఊహించని జోష్ కనిపిస్తోంది.

### మందిరానికి కేజీల కొద్దీ బంగారం విరాళం


అయోధ్య,దాదాపు 500 ఏళ్ల తరువాత అయోధ్యలో రామయ్య కొలువుతీరాడు. భారతదేశంతో పాటు విదేశాలలోని భక్తులు సైతం చారిత్రాత్మక ఘట్టాన్ని లైవ్ స్ట్రీమింగ్లో వీక్షించారు. దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట అభిజిత్ లగ్నం ముహూర్తంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగింది. జన్మభూమిలో రాముడు కొలువు దీరాలని భావించి రోజువారీ కూలీల నంచి కుబేరుల వరకు దేశ విదేశాల్లోని భక్తులు అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి తమ వంతుగా విరాళం ప్రకటించారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి భూరి విరాళం సూరత్కు చెందిన వజ్రాల వ్యాపారి అందించారు. వి దిలీప్ కుమార్ అనే డైమండ్ బిజినెస్ మ్యాన్ కుటుంబం రామయ్యకు తన వంతుగా 101 కేజీల బంగారాన్ని విరాళం ఇచ్చారు. ఆలయంలో నిర్మించిన తలుపులకు బంగారం పూత పూయడం తెలిసిందే. అయితే మార్కెట్లో ఉన్న ధర ఆధారంగా చూస్తే.. వజ్రాల వ్యాపారి దిలీప్ కుమార్ ఫ్యామిలీ రామాలయానికి దాదాపు రూ.68 కోట్లు రామ మందిరం ట్రస్టుకు విరాళం అందించినట్లు తెలుస్తోంది. రామయ్య గుడి నిర్మాణానికి వచ్చిన భారీ విరాళం ఇదే. అయోధ్య రామ మందిర నిర్మాణానికి రెండో అతిపెద్ద విరాళాన్ని ఆధ్యాత్మిక గురువు మొరారీ బాపు అందించారు. రామ మందిరం కోసం మొరారీ బాపు రూ. 11.3 కోట్లను అందించారు. అమెరికా, బ్రిటన్, కెనడాలోని తన అనుచరుల విరాళాల ద్వారా నిధులు 8 కోట్లు రూపాయలు జమకూర్చినట్లు సమాచారం. సూరత్ కు చెందిన మరో వజ్రాల వ్యాపారి గోవింద్ భాయ్ ఢోలాకియా రూ.11 కోట్లు విరాళం ఇచ్చారు.

# రోజా సొంత పార్టీ శ్రేణులు టార్గెట్

విజయవాడ, జనవరి 24 వైసీపీలో మంత్రి రోజాకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంది. ఆమెను సొంత పార్టీ శ్రేణులు టార్గెట్ చేసుకుంటున్నాయి. సరిగ్గా ఎన్నికల ముంగిట తమ స్వరం వినిపిస్తున్నారు. ఏకకాలంలో ముప్పేట దాడి చేస్తుండడంతో.. రోజా వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానం పెరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఆమెకు టికెట్ లేదన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. కానీ తనకు టికెట్ తప్పకుండా లభిస్తుంది అన్న ధీమాతో రోజా ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే రోజాను టార్గెట్ చేసుకొని నగిరి నియోజకవర్గ వైసిపి ప్రజాప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేస్తుండడం సంచలనం కలిగిస్తోంది. ఇదంతా రోజాకు టిక్కెట్ ఎగ్గొట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమని ప్రచారం జరుగుతోంది.పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఓ మహిళా దళిత కౌన్సిలర్ తిరుపతిలో రోజాకు వ్యతిరేకంగా ప్రెస్ మీట్ పెట్టారు. మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తామని డబ్బులు తీసుకున్నారని.. కానీ రోజా ఇవ్వలేకపోయారని ఆరోపణలు చేశారు. కనీసం తీసుకున్న డబ్బులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి సంబంధించిన కొన్ని వీడియోలను సైతం ప్రదర్శించడం విశేషం. ప్రస్తుతం ఈ వీడియోలే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు చిత్తూరు జడ్పీ సమావేశంలో నగిరి నియోజకవర్గానికి చెందిన జడ్పిటిసిలు మంత్రి రోజా తీరుపై మండిపడ్డారు. అభివృద్ధి పనులకు సంబంధించి సహకరించడం లేదని ఆరోపణలు చేశారు. ఆమెకు మరోసారి నగిరి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని కూడా ఛాలెంజ్ చేశారు.వాస్తవానికి మంత్రి రోజా వ్యవహార శైలి సొంత పార్టీ శ్రేణులకే మింగుడు పడడం లేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులతో ఆమెకు గిట్టడం లేదు. నియోజకవర్గంలోని ఏ ఒక్క నేతతో ఆమెకు సంబంధాలు ఉండవు. దీంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఎక్కువ మంది నేతలు వ్యతిరేకిస్తున్నారు. పైగా అసమ్మతి నేతలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సాహం ఉంది. చాలామంది రోజాతో పని లేకుండానే మంత్రి పెద్దిరెడ్డితో పనులు చేయించుకుంటున్నారు. పుత్తూరు 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి తాజాగా ఆర్కే రోజాపై తీవ్ర ఆరోపణలు చేశారు. పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం రోజా డబ్బు డిమాండ్ చేశారని ఆరోపించారు. రోజా తనను రూ.70 లక్షలు డిమాండ్ చేశారని.. చివరికి తాను రూ.40 లక్షలు ఇచ్చానని ఆరోపించారు. మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి పంపించిన వ్యక్తికి తాను మూడు విడతల్లో రూ.40 లక్షలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆఖరికి మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వకపోగా.. డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదని భువనేశ్వరి ఆరోపించారు.మరోవైపు, చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం వడమాల పేట, నింద్ర జడ్పీటీసీలు మురళీధర్ రెడ్డి, మల్లేశ్వరి మంగళవారం మీడియాతో మాట్లాడారు. మంత్రి రోజా గురించి చెబుతూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. కక్ష సాధింపుతో రోజా తమను ఇబ్బందులకు గురి చేశారని.. ఆఖరికి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులకు కేటాయించిన జడ్పీ నిధులకు రోజా ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా చేస్తున్నారని అన్నారు. భవనాలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు జడ్పీటీసీలకు ప్రత్యేక గదులు కేటాయించలేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ను నిలదీశామని వడమాల పేట, నింద్ర జడ్పీటీసీలు జడ్పీటీసీలు మాట్లాడారు.సరిగ్గా వైసిపిలో అభ్యర్థులను మార్చుతున్న క్రమంలోనే రోజాను టార్గెట్ చేసుకుంటూ నగిరి వైసీపీ ప్రజాప్రతినిధులు రచ్చ చేస్తుండడం విశేషం. గత ఎన్నికల్లో సైతం ఆమె స్వల్ప మెజారిటీతో బయటపడ్డారు. ఈసారి మాత్రం ఆమెకు ఓటమి తప్పదని సంకేతాలు వస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో సొంత పార్టీ శ్రేణులు సైతం హెచ్చరిస్తుండడంతో హై కమాండ్ పునరాలోచనలో పడే అవకాశం ఉంది. నగిరి నియోజకవర్గ టికెట్ ఎట్టి పరిస్థితుల్లో రోజాకు దక్కదని వైసీపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నారు. కానీ రోజా మాత్రం జగన్ పై విధేయత కనబరుస్తూనే తప్పకుండా తనకే టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి అధినేత జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# సోషల్ మీడియాలో ట్రెండ్ నారా లోకేష్

విజయవాడ, జనవరి 24 టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈరోజు ఆయన జన్మదినం కావడంతో టిడిపి శ్రేణులు వినూత్న రీతిలో శుభాకాంక్షలు చెబుతున్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుతున్నారు. టిడిపి శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరోవైపు నారా లోకేష్ తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటుగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.లోకేష్ కు బర్త్ డే విషెస్ చెబుతూ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో సందేశాలు పెడుతున్నారు. హ్యాపీ బర్త్డే యంగ్ లీడర్ లోకేష్ హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. దేశవ్యాప్తంగా రెండో స్థానంలో? హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో ఉంది. నాడు మంత్రిగా లోకేష్ తీసుకున్న కీలక నిర్ణయాలను గుర్తు చేస్తూ అభిమానులు ట్వీట్ చేస్తున్నారు. యువగళం సక్సెస్ ఫుల్ గా పూర్తి చేయడాన్ని అభినందిస్తున్నారు. టిడిపికి భావి నాయకుడిగా అభివర్ణిస్తున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల సైతం తమ ట్విట్టర్ ఖాతాలో శుభాకాంక్షలు చెప్పారు.గత ఏడాది జన్మదిన వేడుకల సమయంలో సైతం లోకేష్ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో జాతీయస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచారు. గత ఏడాది జనవరి 27న యువగళం పాదయాత్రను లోకేష్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. డిసెంబర్ 20న విశాఖ జిల్లాలో ముగించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలో పాదయాత్ర విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. లోకేష్ రాజకీయంగా పరిణితి సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులతో మమేకమై పనిచేస్తున్నారు. గతం కంటే తన బలాన్ని పెంచుకుంటూ పార్టీపై పట్టు సాధించారు. అందుకే పార్టీ శ్రేణులు లోకేష్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపాయి. సోషల్ మీడియాలో లోకేష్ ట్రెండింగ్ గా నిలవడం పై టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే స్ఫూర్తిని కొనసాగించి తెలుగుదేశం పార్టీకి ఘన విజయం సాధించి పెట్టాలని కోరుతున్నాయి.



## చంద్రశేఖర్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించిన మురళీ మోహన్ రెడ్డి



కోసిగి,జనవరి24 (విభారె న్యూస్) కోసిగి మండలం జంపాపురం గ్రామవాసి పల్లి చంద్రశేఖర్ రెడ్డి (33) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మండల ఇంచార్జీ పి మురళీ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం చంద్రశేఖర్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. గతంలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ చేయించిన తర్వాత వారం రోజుల క్రితం 4లక్షల ఎల్ఓసి ఇవ్వడం జరిగిందని,ఇలా జరుగుతుందని అనుకోలేదని భావోద్వేగానికిలోనయ్యారు. అనంతరం బసిరెడ్డి, రంగారెడ్డి,గిరిరెడ్డి, ఇంద్రారెడ్డి,వాసు తదితరులు నివాళులు అర్పించారు.

## కర్నూలు పట్టణంలోని బంగారుపేటలో నాటు సారా స్థావరాల పై విస్తృతంగా దాడులు?.

### - జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్.



విభారె న్యూస్ జనవరి 24 కర్నూలు జిల్లా ప్రతినిధి..కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లో భారీగా పట్టుబడిన నాటుసారా.రానున్న ఎన్నికల నేపథ్యంలో విస్తృతందా దాడులు.జిల్లాలో ఎక్కడైనా నాటు సారా,మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజలు డయల్100గాని,స్థానికపోలీసులకు సమాచారం అందించండి.బుధవారంఉదయం జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూలు సబ్ డివిజన్ డిఎస్పీ విజయ శేఖర్ ఆధ్వర్యంలో కర్నూలు రెండవ పట్టణ పోలీసులు కర్నూలు బంగారు పేటలో నాటు స్దావరాల పై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దాడుల్లో 12 వందల లీటర్ల నాటు సారా ఊట బెల్లం ను ధ్వంసం చేశారు. 130 లీటర్ల నాటు సారా,500 కేజీల నల్లబెల్లం ను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడులలోకర్నూలు టు టౌన్ సిఐ ఇంథియాజ్ భాషా ఎస్సైలు ఖాన్,ప్రేమ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ఎమ్మెల్యే తనయుడు ధరణి రెడ్డి మీా వాదం పత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..!

### ప్రజలను చైతన్యం చేసేది పత్రిక విలేకరులే ..!



పెద్దకడబూరు జనవరి 24 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోని ప్రజలను చైతన్యం చేసేది పత్రికలే అంటూ వై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తనయుడు ధరణి రెడ్డి అన్నారు. అలాగే ధరణి రెడ్డి , చేతుల మీాదుగా ఎమ్మిగనూరులో స్వగృహం నందు నూతన సంవత్సరం మీా వాదం తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ధరణి రెడ్డి మాట్లాడుతూ మీా వాదం దినపత్రిక ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమాజాన్ని మేలుకొలుపు చేసేది పత్రికలే అని అన్నారు. పత్రిక విలేకరులు ప్రజల మన్ననలు పొందాలన్నారు. అలాగే పత్రిక విలేకరులు కలిసి పనిచేసే సమాజాన్ని ప్రభావితం చేయవచ్చు అని అన్నారు. అలాగే రాజకీయ పార్టీలకు అతీతంగా నిజాలు నిర్భయంగా వార్తలు రాస్తూ ఉన్నత స్థానంలో నిలవాలని అకాంక్షించారు. అలాగే చిన్న పత్రిక పెద్ద పత్రిక అని తేడా లేకుండా మీాకు మన వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున ఎల్లవేళలా మీా వాదం పత్రిక కు అండగా ఉంటామని హామీా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పత్రిక విలేకరులు రాజు. నరసింహా, రంగముని,సుసింద్ర, బజారి, భీమన్న, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రభుత్వం "ఆసరా":ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24- పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం ఆసరా అని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాడు చేపట్టిన పాదయాత్రలో రాష్ట్రంలోని పేదింటి అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన ప్రతి హామీలను తూచా తప్పకుండా నెరవేర్చారని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు . బుధవారం నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం లోని స్వయం సహాయక సంఘాలకు ఆసరా 4వ విడత లో 5కోట్ల64లక్షల41వేల రూపాయల నగదును వారి ఖాతాల్లో జమ చేశారని తెలిపారు . ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండల అక్క చెల్లెమ్మల తరఫున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆసరా నాలుగో విడత మెగా చెక్కును లబ్ధి దారులైన మహిళలకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ప్రహ్లాద రెడ్డి, అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోస్పాడు తాహాసిల్దార్ విజయ శేఖర్. రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పిపి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికలారెడ్డి , నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, ఎంపీపీ ఆర్థర్ సైమన్, ఎంపీటీసీలు బోరం భారతి, మహేశ్వరమ్మ, సర్పంచులు గడ్డం రత్నమ్మ, కోటిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జెట్టి గోకారి, వైసీపీ నాయకులు బెక్కం నాగేశ్వరరెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మరియు గోస్పాడు మండల వైసీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నంద్యాల అభివృద్ధే మా ధ్యేయం

### శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24- నంద్యాల అభివృద్ధే మా ధ్యేయం. మా లక్ష్యం అని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని 42 వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక వార్డులో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలకు 20 లక్షల రూపాయలను నిధులను కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు . ఇందులో భాగంగా పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును స్థానిక కౌన్సిలర్ శిరీష వార్డు ఇంచార్జ్ కిరణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు.. రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నంద్యాల నియోజకవర్గంలో 14 కోట్ల 40 లక్షల రూపాయల నిధులను కేటాయించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అలాగే నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 8 కోట్ల 40 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు , కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. అలాగే నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత మెడికల్ కళాశాల, హాస్పిటల్ అభివృద్ధి, బాలికల జూనియర్ కళాశాల, ఐటిఐ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, అర్బన్ సెంటర్లు, పార్కులు, అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా. మున్సిపల్ అధికారులు రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిపి మధుసూదన్ రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మ నాగన్న, కౌన్సిలర్స్ శాదిక్ భాష, లక్ష్మీనారాయణ, మేదర లక్ష్మీదేవి, శివ, తిరుపాలు కుమ్మరి రాముడు, ఓబుళపతి,సల్మాన్ రాజు,వార్డు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అందిస్తాం.....





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 24 డోన్ పట్టణంలో 24వ వార్డు నందు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ...బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు. తల్లికి వందనం పథకం క్రింద ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి 15,000 రూపాయలను ఖాతాల్లో జమ అవుతాయని .దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా. అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం. యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి అన్ని విధాల వారికి అండగా నిలుస్తాం. పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులుగా మార్చే కార్యక్రమం. తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం చేయనుందని అన్నారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో స్థానికుడైన నాకు డోన్ లో ఎమ్మెల్యే అయ్యేందుకు 50సంవ్సరాల తరువాత అవకాశం వచ్చింది కావున నన్ను ఆశీర్వదించవలసినదిగా కోరుతున్నానని అన్నారు. వార్డు నాయకులు: మైనారిటీ కమిటి ప్రధాన కార్యదర్శి అలీబాబా. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ అలా మల్లిఖార్జున రెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు అజీజ్, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు, డోన్ పట్టణ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్, డోన్ పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మర్రి ఉపేంద్ర, డోన్ పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటీకేబుల్ కిరణ్, డోన్ పట్టణ టిడిపి కమిటీ నాయకులు పాలరాజు, డోన్ నియోజకవర్గ టిడిపి ఐటిడిపి అధ్యక్షులు హుస్సేన్ పీరా, డోన్ మండలం టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కోనేటి కాశీ విశ్వనాథ్, హనుమంత రెడ్డి, ఐటిడిపి హ్యుమయూన్, చిన్న కాంత్, పెద్ద కాంత్, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నీలం ప్రభాకర్, తెలుగుయువత కమిటీ నాయకులు ప్రవీణ్ రెడ్డి, తెలుగుయువత కమిటీ నాయకులు బబ్లూ యాదవ్, వేంకటేశ్వర్లు, సర్దార్ పాష, గుల్షన్ , శేఖర్ గౌడ్, యూనిట్ ఇంచార్జ్ వీరాంజి, పట్టణ కమిటీ నాయకులు నాగేంద్ర, ఐటిడిపి బీఎడ్ భాషా, ఐటిడిపి పార్థు, ఐటిడిపి మురళీ, డాన్ శ్రీను, ఐటిడిపి షేక్షా,ఐటిడిపి ఖాజా,కబీర్ దాస్ ,ఎనిబట సుధ ,షాష,మెకానిక్ భాష, షాష, , రామాంజినేయులు,కాజా, మల్లిఖార్జున, సురేష్, మధు, బ్రహ్మయ్య ,తదితరులు పాల్గొన్నారు.




## శివదీక్ష స్వీకరించే భక్తులకు సమాచారం...

విభారె న్యూస్ జనవరి 24 శ్రీశైలం..శివ దీక్ష స్వీకరించే భక్తులకు తెలియజేయునది ఏమనగా ఈ సంవత్సరం శివదీక్ష మాల స్వీకరించే తేదిలు. మండలం (41) : 26-01-2024 శుక్రవారం, పాడ్యమి. అర్ధమండలం (21): 16-02-2024శుక్రవారం, సప్తమి. మహాశివరాత్రి : 08-03-2024 శుక్రవారం శివదీక్ష స్వీకరించి శ్రీ శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఆశీస్సులు లభించుగాక..

## తాలూకా స్థాయి పోటీలను ప్రారంభం



క్రీడా ప్రాంగణానికి వస్తున్న ఎంపీ ఎమ్మెల్యే మాజీ విప్

ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 24 విభారె న్యూస్ :- వైపిపిఎం క్రీడా ప్రాంగణంలో తాలూకాస్థాయి క్రీడా పోటీలను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శాసనసభ్యులు గంగుల నాని, రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలు క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గంగుల నాని మాట్లాడుతూ తాలూకా స్థాయి పోటీలను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏ ప్రభుత్వం ఇంత శ్రద్ధ తీసుకోలేదన్నారు. విద్యార్థులలో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఆడదాం ఆంధ్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలోఆర్డీవో శ్రీనివాసులు,తహసిల్దార్లుహరినాధరావు,రవీంద్రప్రసాద్, ఎంపీడీవో మహబూబ్ఖాన్,మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, పీఈటీలు, క్రీడాకారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ జోనల్ కళాశాలలో ఘనంగా డ్రైవర్ దినోత్సవ వేడుకలు...



విభారె న్యూస్ జనవరి 24 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..24.01.2024 న ఆర్టిసి కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు ఆర్టిసి జోనల్ కళాశాల యందు డ్రైవర్ దినోత్సవ వేడుకలు జరిగినవి. ఈ కార్యక్రమాన్ని కర్నూలు ప్రజా రవాణా అధికారి,టేకి వెంకట రామం ప్రారంభించడం జరిగింది. ప్రయాణీకులను క్షేమంగా గమ్య స్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలుపుటకు ఉద్దేశ్యించిన ఈ వేడుకలలో,డ్రైవర్ల శ్రమను, వృత్తి పట్ల వారి అంకిత భావాన్ని గుర్తించి,వారిని అభినందించాలని,ఆర్టీసి డ్రైవర్లు మరింత శ్రద్ధగా బస్సులు నడిపి,ప్రజల మన్ననలను పొందాలని ప్రజా రవాణా అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లాకు డిపో మేనేజర్లు,జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## "ఫొటోగ్రఫీ" కాంపిటీషన్స్

### నగదు. ప్రశంసా పత్రం డీఈవో సుధాకర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24-గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు "ఫొటోగ్రఫీ" కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చన్నారు. నంద్యాల జిల్లా పర్యాటక ప్రాంతాలు, జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే అంశాలు, జిల్లాకు మాత్రమే ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు,ప్రకృతి రమణీయత ను ఒడిసిపట్టే ఛాయాచిత్రాలు ఏవైనా మీా మొబైల్ లేదా కెమెరాతో షూట్ చేసి క్రింద ఇచ్చిన గూగుల్ లింక్ నందు అప్లోడ్ చేయాలన్నారు. మీారు తీసేఫొటో తప్పనిసరిగా గూగుల్ కెమెరాతో తీయబడి, లొకేషన్ మరియు ఫొటో తీసిన సమయాన్ని చూపించాలన్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలవరకు తీసిన ఫొటోగ్రాఫ్స్ మాత్రమే పోటీకి అర్హత పొందుతాయన్నారు. పాత ఫొటోలు అనుమతించబడవన్నారు. అత్యుత్తమ ఫోటోల ఎంపికలో క్రియేటివిటీ కీ అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. విజేతలకు రిపబ్లిక్ డే రోజున గౌరవ కలెక్టర్ గారి చేతుల మీాదుగా ప్రశంసాపత్రము మరియు నగదు బహుమతి అందజేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190